క్లుప్తంగా

అంచనాలకు మించి ధాన్యం దిగుబడి

నరసన్నపేట: మండలంలో సాంబ రకం ధాన్యం ఎకరాకు 20 నుంచి 23 బస్తాల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. నరసన్నపేట మండలం నడగాం గ్రామంలో పతివాడ అప్పారావుకు చెందిన వరి(సాంబ) పొలంలో ఏఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. నిర్ణీత విస్తీర్ణంలో 12.144 కేజీల ధాన్యం దిగుబడి నమోదైంది. దీని ప్రకారం ఎకరాకు 25 నుంచి 27 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

సారవకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రి సరఫరా అయినట్లు ఎంఈఓ రమణ శనివారం తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈ క్రీడా సామగ్రి వేర్వేరుగా వచ్చాయన్నారు. వీటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

సారవకోట: మండలంలోని గొర్రిబంద సకల విద్యా గణపతి యూత్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పోతుమహంతి సాంబమూర్తి జ్ఞాపకార్థం సారవకోటలోని నవతేజ పాఠశాలలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సారవకోట కేజీబీవీ, బుడితి, అలుదు, చిన్నకిట్టాలపాడు, నవరబొంతు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు 70 మంది హాజరయ్యారు. 7 టీములుగా ఏర్పాటు చేసి క్విజ్ పోటీలు నిర్వహించగా.. బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ, నవతేజ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఎంఈఓ రమణ బహుమతులు అందజేశారు. నవతేజ పాఠశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం

ఆమదాలవలస రూరల్: పశువులకు సక్రమించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ ఆర్.ఆనందరావు అన్నారు. మండలంలోని కొర్లకోట గ్రామంలో శనివారం పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో పశువులకు పలురకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను అందజేశారు. రైతులు, డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి

నరసన్నపేట: గ్రామాల్లో బాలల సంరక్షణపై కమిటీలు ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలపై నిఘా పెంచాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఎ.అనురాధ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం, దత్తత తదితర అంశాలపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు మల్లేశ్వరరావు, గీత, నాయుడు, ఐసీడీఎస్ సూపర వైజర్లు రమణమ్మ, నిర్మల, దుర్గమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారంపై అప్రమత్తం



పాతపట్నం: పెద్దపులి పాద ముద్రలను పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్ఓ నాగేంద్ర

పాతపట్నం: కొంత కాలంగా టెక్కలి, మెళియాపుట్టి మండలాల సరిహద్దు గ్రామాల్లో పెద్దపులి సంచారం ఉంది. అయితే శనివారం ఉదయం పాతపట్నం మండలం చిన్నమల్లిపురం పంచాయతీ చీడిపేట గ్రామ సరిహద్దు గ్రామాల్లో పెద్దపులి పాద ముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మండలంలోని చీడిపేట పరిసర గ్రామాల్లో శనివారం పెద్దపులి పాద ముద్రను టెక్కలి సబ్ డీఎఫ్ఓ నాగేంద్ర, ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓ మాట్లాడుతూ పాతపట్నం మండలం చీడిపేట పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్న ఆనవాలు గుర్తించామని, సాయంత్రమైతే ప్రజలు బయటకు రాకుండా ఉండాలని, రాత్రి వేళల్లో పంట పొలాలకు నీరు కట్టేందుకు వెళ్లే రైతులు కొద్దిరోజులు మానుకోవాలన్నారు. పులి అలికిడి కనిపిస్తే వెంటనే అటవీశాఖాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. రైతులు, గిరిజనులు తెల్లవారు జామున పంట పొలాలవైపు, కొండ పరిసరాల ప్రాంతాల వైపు వెళ్లవద్దన్నారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి పి.యశస్వీ, ఎఫ్‌బీఓ కే.ఉమా మహేశ్వరరావు, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



జలుమూరు: యలమంచిలిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



హిరమండలం: రుగడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- నరసన్నపేట, పాతపట్నం ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వానికి అపూర్వ స్పందన

జలుమూరు: అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. యలమంచిలి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు జగనన్నను దీవించి సీఎంను చేయాలని కోరారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ ఘెండ రవికుమార్ తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. గడపగడపకు నిధులతో వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తనకు రెండు కాళ్లు పనిచేయడంలేదని, మెరుగైన వైద్యం చేయించాలని ఎమ్మెల్యేను వాన గణేష్ కోరారు. మెరుగైన వైద్యం కోసం అవరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షుడు పి.రాజప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, పార్టీ సీనియర్ నాయకుడు మెండ అప్పారావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దామ మన్మథరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, పి.విజయ్, మాజీ ఎంపీటీసీ వాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు..

హిరమండలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రుగడ, కొమనాపల్లి, అవలంగి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏ గ్రామం వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. సంక్షేమ పథకాల కోసం అర్హులు ఎవరైనా ఉంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు పొందాలంటే అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సర్పంచ్‌లు పల్లి శారద, కె.దేవి, పి.పల్లవి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రియాంక, పార్టీ నాయకులు ఇంద్రకుమార్, రామకృష్ణ, పల్లి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

హిరమండలం: స్థానిక శ్రీరామా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మురపాక ముఖలింగం ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ ఆర్.గోపాలరావు, ప్రిన్సిపాల్ శాంతారావు, అధ్యాపకులు శనివారం అభినందించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో కూడా ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు.

రైతు సంక్షేమానికి కృషి



జెండా ఆవిష్కరిస్తున్న కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

సరుబుజ్జిలి: సహకార సంఘాల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొవిలాపు చంద్రశేఖర్ తెలిపారు. 70వ సహకార వారోత్సవాలు సందర్భంగా స్థానిక పీఏసీఎస్ ఆవరణలో శనివారం జెండాను ఆవిష్కరించారు. సహకార సంఘం సీఈఓ బి.వి.రామారావు, డైరెక్టర్లు బెండి జగన్నాథరావు, సీర సింహాచలం, కార్యాలయం సిబ్బంది ఉపేంద్ర, గౌరినాయుడు, సతీష్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఓట్ల తొలగింపు

- ఆర్వో జయదేవి



మాట్లాడుతున్న ఆర్వో జయదేవి

నరసన్నపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనల మేరకే ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగింపులు చేస్తున్నామని నరసన్నపేట ఎన్నికల అధికారి జయదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓట్లు తొలగింపులకు ఫారాలు ఇచ్చినా తొలగించలేదని ఆర్వో దృష్టికి టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకువెళ్లారు. దీనిపై ఆర్వో స్పందిస్తూ.. మరణించిన వారి ఓట్లు తొలగించేందుకు కూడా నిబంధనలు ఉన్నాయన్నారు. ఆ ప్రకారమే తొలగిస్తున్నట్లు తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు ఇక్కడే తమ ఓటు ఉండాని కోరుకుంటే ఉంచుతామని తెలిపారు. మైగ్రేషన్ అయిన వారి ఓట్లు తొలగించాలని ఒత్తిడి వస్తుందన్నారు. ఈ విషయంలో ఓటరు అభిప్రాయమే ప్రధానమన్నారు. ఒకే ఓటరుకు రెండు చోట్ల ఓట్లు ఉంటే ఏదో ఒకచోట ఉంచుకోవచ్చని, ఓటరు అభిప్రాయం మేరకే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్పష్టంగా బీఎల్‌ఓలకు ఇవ్వాలని సూచించారు. నరసన్నపేట నియోజకవర్గంలో ఈ నెల 8 నుంచి 16వ తేదీల మధ్య ఫారం 6లు 652, ఫారం7లు 1303, ఫారం 8లు 637 వచ్చాయని, వీటిని పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, యాబాజి రమేష్, పోలాకి రమణయ్య, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. యలమంచిలిలో రూ.46 లక్షలతో నిర్మాణం చేపట్టిన సచివాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందించేందుకు సీఎం జగన్ సచివాలయ వ్యవస్థ తెచ్చారని, దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయి భవనాలు ఉంటే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయనడానికి సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లే ఉదాహరణ అని అన్నారు.

టీడీపీ నాయకులది ఓర్వలేనితనం..

ఈ నెల 15న నరస్నపేటలో సామాజిక సాధికార బస్సు యాత్రకు అశేషజనం వచ్చారని, అనుకున్నదాని కంటే ఎక్కువగా విజయవంతమైందని, ఇది చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధిస్తుందన్నారు. నాలుగేళ్లుగా కనబడని టీడీపీ నాయకులు మళ్లీ మాయమాటలు చెప్పేందుకు గ్రామాల్లోకి వస్తున్నారన్నారు. వీటిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

సారవకోట: మండలంలోని దాసుపురం, ధర్మలక్ష్మీపురం, నౌతళ, బొంతు తదితర గ్రామాల్లో పులి సంచారంపై అటవీశాఖ సిబ్బంది అప్రమత్తం చేశారు. పాతపట్నం మండలం కొయ్యకొండ సమీపంలో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. ఆ గ్రామానికి సమీపంలో ఉన్న సారవకోట మండలంలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి పూట కొండలు, పొలాలకు వెళ్లవద్దని సూచించారు.

నియోనేటల్ అంబులెన్స్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు హేమంత లక్ష్మి

మెళియాపుట్టి: అప్పుడేపుట్టిన శిశువులకు అత్యవసర చికిత్సలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నియోనేటల్ (నవజాత శిశువు) 108 వాహనాలతో ఎంతో ప్రయోజనం చేకూరనుందని, ఎన్నో ప్రణాలు కాపాడవచ్చునని చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హేమంత లక్ష్మి అన్నారు. శనివారం చాపర పీహెచ్‌సీలో నియోనాటల్ 108 అంబులెన్స్‌ను పరిశీలించారు. అత్యాధునికమైన పరికరాలు అంబులెన్స్‌లో ఉంటాయని సిబ్బందికి తెలియజేశారు. వాహనంలో నిక్షిప్తం చేసిన డబల్ ఆక్సిజన్ సిరంజ్ పంప్, ఇంక్యుబేటర్, మోనిటర్, ఇన్ఫ్యూజన్ పంప్ వంటి పరికరాల కోసం సిబ్బందికి వివరించారు. ఈ వాహనం ద్వారా నవజాత శిశువును తరలించడానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు కూడా ఉచితంగా తరలిస్తారు. శిశువులను ప్రాణాపాయం నుంచి తప్పించడానికి ఈ వాహనాలు సంజీవనిలా ఉపయోగపడతాయన్నారు. 108 సిబ్బంది శ్రీనివాసరావు, ఆదినారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది పద్మావతి, శాంతిప్రియ, త్రివేణి తదితరులు ఉన్నారు.

ఎంపీగా జిల్లాకు చేసిందేంటి?

- రామ్మోహన్‌నాయుడికి చిరంజీవినాగ్ సూటిప్రశ్న

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కరువు మండలాలను ప్రకటించాలంటే ఒక్క వర్షపాతమే ఆధారం కాదని హైడ్రలాజికల్ పారామీటర్స్, రిజర్వాయర్‌లో నీరు, నీటిపారుదల, భూగర్భజలాలు, భూమిలో తేమ శాతం వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటారన్న విషయం ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు తెలియదా అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధానకార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన జిల్లాల జాబితాను టీడీపీ ప్రభుత్వ హయాంలో నీతిఆయోగ్ అడిగితే శ్రీకాకుళం జిల్లా పేరును ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. ఆ తర్వాత ఐదు జిల్లాల పేర్లు ఇవ్వమంటే అప్పుడు ప్రతిపాదించారని గుర్తు చేశారు. అప్పట్లో గుర్తుకురాని శ్రీకాకుళం జిల్లా ప్రజలు, రైతులపై ఇప్పుడెందుకు సవతిప్రేమ వచ్చిందో చెప్పాలన్నారు. ఎన్నికల దగ్గరవుతుండటంతో ఎక్కడలేని ప్రేమాభిమానాలు పుట్టుకొస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 680 మండలాలు ఉండగా 80 మండలాలు తీవ్రమైన కరువు, 23 మోస్తరు కరువు మండలాలుగా అక్టోబర్ 23న ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలియదా?అని ప్రశ్నించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం



ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస రూరల్: గ్రామీణ ప్రాంతంలో మహిళా రైతులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని సభ్యులంతా, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులందరికీ అవగాహన కల్పిస్తూ, పశువుల ఎరువును, పెంటగత్తాలను వినియోగించి భూసారాన్ని పెంచాలన్నారు. అధిక మోతాదులో ఎరువుల క్రిమిసంహారక మందులు ఉపయోగించడం వల్ల నేల ఆరోగ్యం కాలుష్యంగా మారి, భూమి నిస్సారమై పోతుందన్నారు. మహిళా రైతులంతా గ్రామాల్లో వర్మికంపోస్టు యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కోశాధికారి రేణుక, క్లస్టర్ కోఆర్డినేటర్లు సుభద్ర ,రమణ, రామప్పడు పాల్గొన్నారు.

నందివాడలో పురిల్లు దగ్ధం



కాలిపోతున్న ఇల్లు

పొందూరు: మండలంలోని నందివాడలో శనివారం ఎచ్చెర్ల ఆదిలక్ష్మికి చెందిన పురిల్లు దగ్ధమైంది. ఇంట్లో సామాన్లు, డబ్బులు కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక వాహనం వచ్చేసరికే ఇల్లు కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు చెప్పారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: మౌలిక వసతుల కల్పనతో గ్రామాలు త్వరితగతిని అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తిలారు రైల్వే స్టేషన్ నుంచి తిలారు జంక్షన్ వరకు రూ.25 లక్షల మార్కెట్ కమిటీ నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. తాగునీరు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ వాన గోపి, బుక్కా లక్ష్మణరావు, మూకల్ల సత్యం, దుంగ ప్రసాద్, స్థానిక నాయకులు సింహాచలం, రావాడ హిమవంత్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్‌గా శ్రేయ మిశ్రో



శ్రేయ మిశ్రోకు మెమోంటో అందిస్తున్న విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

పాతపట్నం: పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయ మిశ్రోకు స్టూడెంట్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్–2023 బిరుదు లభించింది. శనివారం విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖల ఆధ్వర్యంలో బాలల వారోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగురాలైన శ్రేయ మిశ్రో నృత్యంలో ప్రతిభ కనబర్చారు. శ్రేయ మిశ్రోను విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడుతూ.. వారికి అన్ని రంగాల్లో తర్ఫీదునిచ్చి ప్రోత్సహించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిటీ చైర్మన్ కేసరి అప్పారావు, సీడబ్ల్యూసీ చైర్‌పెర్సన్ హిమబిందు, ప్రసాదరావు పాల్గొన్నారు.

పీఎంసీ మెంబర్ ఆత్మహత్యాయత్నం

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పెరెంట్స్ మానటరింగ్ కమిటీ (పీఎంసీ) సభ్యురాలు, మాజీ చైర్‌పర్సన్ గట్టెం హేమలత శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నాడు–నేడు ఫేజ్–1లో రూ.1.54 కోట్లతో పనులు మంజూరు కాగా.. పీఎంసీ చైర్‌పర్సన్‌గా ఈమె ఉన్నప్పుడు పనులు చేపట్టారు. సంబంధిత బిల్లులు చెల్లించలేదని శనివారం పాఠశాలకు వెళ్లి మాత్రలను మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే ఉపాధ్యాయులు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వేధిస్తుండటంతోపాటు అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు. అప్పు చేసి పనులు చేశానని, వడ్డీలు కట్టలేకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యా ప్రయత్నం చేయాల్సి వచ్చిందన్నారు.

రికార్డులు సరిగాలేవు..

హేమలత పూర్తిచేసిన పనుల బిల్లులకు సంబంధించిన పూర్తిస్థాయి రికార్డులు లేవన్నారు. సోమవారం కమిటీ సభ్యులు, ఇరువురు హెచ్‌ఎంలు, ఏఈ సమక్షంలో సమావేశం నిర్వహించి నగదు చెల్లిస్తామన్నారు. ఈ విషయాన్ని పీఎంసీ సభ్యురాలు హేమలతకు తెలియజేశామన్నారు.

– చైర్‌పర్సన్ , రాంబిల్లి రామలక్ష్మి

పూర్తిస్థాయిలో బిల్లులు ఇవ్వలేదు..

ఫేజ్–1 పనులు సంబంధించి సుమారు రూ.90 లక్షలు వరకు చెల్లించామని, మరో రూ.16 లక్షల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తానికి సరిపడా బిల్లులు మాకు ఇవ్వలేదన్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెడితే వెంటనే నగదును చెల్లిస్తామన్నారు. సోమవారం ఇరువురు (పాత, కొత్త) హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన తర్వాత బిల్లులు చెల్లిస్తామన్నారు.

– ఏఈ కిరణ్ ,నాడు–నేడు పథకం

కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చాం..

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు కమిటీ సభ్యులందరికీ సమాచారం ఇచ్చి, కొత్త కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం పీవీ రామరాజు (ప్రస్తుతం ఎంఈఓ) సమయంలో పనులు జరిగాయని, ఎంత మేరకు పనులు జరిగాయన్న దానికి సంబంధించి రికార్డులు, నివేదికలు తనకు ఇవ్వలేదన్నారు.

–వెంకటరావు , పాఠశాల హెచ్‌ఎం

జయహో భారత్ ..



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ మురళి

నరసన్నపేట: ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ (ఇండియా–ఆస్ట్రేలియా)ను వీక్షించేందుకు స్థానిక కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య తెలిపారు. ఆదివారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. స్థానిక యువత, క్రికెట్ అభిమానుల కోరిక మేరకు స్క్రీన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లను శనివారం సాయంత్రం పరిశీలించారు. మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు, యువత ప్రశాంతంగా చూడాలని కోరారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తదితరులు ఉన్నారు.